క్లుప్తంగా

శ్రవణకుమారికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధకురాలు కుడికాల శ్రవణకుమారికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎన్హాన్స్‌డ్ సెంటిమెంట్ అనలసిస్ అండ్ క్లాసిఫికేషన్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ అప్రోచెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రవణకుమారికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంజుల పర్యవేక్షణలో శ్రవణకుమారి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రస్తుతం శ్రవణకుమారి హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు పాము మల్లయ్య కన్నుమూత



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు పాము మల్లయ్య (90) బుధవారం కన్నుమూశారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంతో పాటు 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మల్లయ్య మృతికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కాజీపేట పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో మల్లయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

టెన్త్ ఫలితాల్లో తాళ్ల పద్మావతి పాఠశాల విజయభేరి



ఖిలా వరంగల్: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో వరంగల్ ఉర్సు గుట్ట ప్రాంతానికి చెందిన తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. ఈమేరకు వారిని సన్మానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ బోధన ద్వారా 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వివరించారు.

కేయూలో ముందస్తు అరెస్టులు



కేయూ క్యాంపస్: ప్రపంచ సుందరీమణుల వరంగల్ పర్యటన నేపథ్యంలో ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మర్రి మహేష్, వంశీకృష్ణ, డీఎస్‌పీ బాధ్యుడు శ్రావణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యుడు స్టాలిన్, తదితరులను కేయూ పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు.

ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు..



కాజీపేట రూరల్: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్‌లో సమ్మర్ ప్యూరీఫయర్ వాటర్ సర్వీస్ ప్రోగ్రాంను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాజీపేట డీటీసీ పి.సురేష్‌బాబు, డీటీసీ ఎ.ఎలియా, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

న్యూశాయంపేట: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలపై ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని, కనీస వేతనం రూ. ఏడు వందలు ఇవ్వాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించాలని సూచించారు. వడదెబ్బ, ఇతర ప్రమాదాలకు గురై మరణించిన కూలీల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ఆ ప్లాట్లు వారివే..

హసన్‌పర్తి: భీమారంలో శివారులోని సర్వే నంబర్ 520, 521, 522, 523, 524లో 75 మందికి విక్రయించిన భూములు వారివేనని బూర జంపయ్య తెలిపారు. ప్రస్తుతం ఆ ప్లాట్ల వ్యవహారం సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు తమ స్వలాభం కోసం పక్కదారి పట్టిస్తున్నారని, ఈక్రమంలో ప్లాట్ల యజమానులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని పేర్కొన్నారు.

నిర్లక్ష్యం.. తీస్తుంది ప్రాణం

- పలు వీధుల్లో ప్రమాద ఘంటికలు
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెత్తాచెదారం
- అల్లుకున్న పిచ్చిమొక్కలు, తీగలు
- అధికారులు పట్టించుకోవాలని స్థానికుల వేడుకోలు



భూపేష్‌నగర్‌లో పిచ్చిమొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

ఖిలా వరంగల్ : అధికారుల నిర్లక్ష్యంతో ఎన్నో ఏళ్లుగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వేసవిలో విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌ల్లో మంటలు చెలరేగుతున్నాయి. శివనగర్, శంభునిపేట, కరీమాబాద్ సబ్‌స్టేషన్ల ప్రాంతాల్లోని వరంగల్ ఫోర్ట్, విద్యానగర్, కాశికుంట, నాగేంద్రనగర్, శంభునిపేట, శివనగర్ తదితర ప్రాంతాల్లోని విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. వందల ఏళ్లనాటి ఇనుప స్తంభాలకు వర్షాకాలంలో విద్యుత్ సరఫరా అవుతోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుపోయి, చెత్తాచెదారం పేరుకుపోయింది. వేసవికాలం గాలి వీచినప్పుడు ఒక్కోసారి మంటలు లేస్తున్నాయి. హెచ్చుతగ్గుల సరఫరాతో ఇళ్లల్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా కొందరు అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పది నిమిషాలు గట్టిగా గాలివీస్తే చాలు వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలో ఎప్పుడు కరెంటు సరఫరా నిలిచిపోతుందో, ఎన్ని గంటలకు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏటా వేసవికాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, తీగలు, చెట్ల కొమ్మలను తొలగించి సరఫరాకు ఆటంకం కలుగకుండా చూడాలి. ఆ దిశగా అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్నపాటి గాలులకు కూడా సరఫరా ఆగిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు.

రక్షణ ఏర్పాటు చేయాలి



ఫోర్ట్‌రోడ్డులోని భూపేష్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండి ఉంది. గాలి వీస్తే ఫ్యూజ్ బాక్స్ నుంచి మంటలు వస్తున్నాయి. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఎత్తైన గద్దెపై ఏర్పాటు చేయాలి.

\- ఎండీ.సాదిక్, ఫోర్ట్‌రోడ్డు, వరంగల్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

వరంగల్ ఫోర్ట్ రోడ్డుపై భూపేష్‌నగర్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో నిండి ఉంది. పలు డివిజన్లలో ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గాలి వీస్తే నిలిచిపోతున్న సరఫరా

శివనగర్, కరీమాబాద్, శంభునిపేట సబ్‌స్టేషన్ల పరిధిలో ఎక్కడ చూసినా చెట్ల కొమ్మల మధ్యలో విద్యుత్ తీగలు ఉన్నా ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా శివనగర్, విద్యానగర్, నాగేంద్రనగర్‌లో ప్రమాదకరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తాయి. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన కరెంట్‌ను సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఖిలా వరంగల్: సమావేశంలో ఐక్యతను ప్రదర్శిస్తున్న కార్మిక సంఘాల జిల్లా ప్రతినిధులు



వరంగల్ చౌరస్తా: సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఖిలా వరంగల్: 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.సాగర్, ఏఐసీటీయూ నేత నర్ర ప్రతాప్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్ అధ్యక్షతన బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తలు, కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, జన్ను రాజు, లలిత, సౌందర్య, రాజమ్మ, రవి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా: సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గ అంబేడ్కర్ సెంటర్‌లో సమ్మె వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్టులు తెచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎలకంటి రాజేందర్, మహబూబ్ ఖాన్, బండి కుమార్, రాజేందర్, సదానందం, వెంకటస్వామి, రాజేష్, రాజు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం



కాజీపేట: ప్రకృతి ప్రేమికులను అలరించే మే పుష్పం విరబూసింది. సాధారణంగా ఏప్రిల్ చివరి వారంలో మొగ్గ తొడిగి, మే మొదటి వారంలో పువ్వుగా మారడం ఈ మొక్క ప్రత్యేకత. అందుకే ఈ పుష్పాన్ని మే పుష్పం అని పిలుస్తుంటారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని డీసీసీబీ ఉద్యోగి శ్రీనివాస్ రెడ్డి మిద్దెతోటలో బుధవారం మే పుష్పం వికసించింది. ఆ పుష్పాన్ని చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకించారు.

మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మడికొండ: సీపీఐ హనుమకొండ జిల్లా రెండో మహాసభ వాల్‌పోస్టర్లను రాంపూర్ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిలువ నీడలేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. వారికి పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాజీపేట మండల కార్యదర్శి మాలోతు శంకర్‌నాయక్, రాంపూర్ గ్రామశాఖ కార్యదర్శి మునిగాల స్వామి, మంద సుమన్, బొట్టు భిక్షపతి, మునిగాల ఐలయ్య, బండి వెంకన్న, గుండె నాగరాజు, గన్నారపు కుమార్, మునిగాల యాదగిరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలకు తాడుకట్టు మామూలు ఒక లారీకి రూ.2 వేల చొప్పున ఇవ్వాలని, రైతుల నుంచి కాకుండా ప్రభుత్వమే నేరుగా ఒక బస్తాకు రూ.70 కూలి ఇవ్వాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి, వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ వైవీ.గణేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ హమాలీలకు సంవత్సరానికి రెండు జతల దుస్తులు, రోజుకు నాలుగు పల్లి పట్టీలు, ప్రమాద బీమా ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంగాల మొగిలి, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, నాయకులు కొంగటి సదానందం, బేరపాక కేశవయ్య, సాంబయ్య, భాస్కర్, నాగరాజ్, శంకర్, పోశాలు, భద్రయ్య, రమేష్, అశోక్, రాజయ్య, మామిడి స్వామి, రవి, జగన్, శ్రీనివాస్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దు



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విద్యారణ్యపురి: జిల్లాలో హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి డిమాండ్‌చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించాలనే నిర్ణయంతో తామంతా రోడ్డున పడుతామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు సిబ్బందితో సుబేదారి పోలీస్‌స్టేషన్ సీఐ సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, బాధ్యులు సక్కుబాయి, సమ్మక్క, పర్వీన్, పద్మ, సంధ్య, లక్ష్మి, రాధిక, విజయ, వసుంధర రాణి, తస్లీమ్, షమీ, సరిత, కళ, శైలజ, నిర్మల, భద్ర, సుభద్ర, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషిచేయాలి



విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణకు బట్ట సంచులను వినియోగిద్దామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. తన పెళ్లిరోజును పురస్కరించుకొని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం, మజ్జిగను హనుమకొండలోని కిషన్‌పురలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు కుమారస్వామి, నర్సింహారావు, రాంచందర్, అనంత్, రమేష్, నర్సయ్య, లక్ష్మయ్య, వేణు, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

హసన్‌పర్తి: వడదెబ్బకు గురై మృతిచెందిన సీతానాగారం పంచాయతీ కార్మికుడు రాజేందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను సీఐటీయూ నాయకులు బుధవారం పరామర్శించారు.

క్రైం కార్నర్

తాళం వేసి ఉన్న రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ డీజిల్ కాలనీ రైల్వే క్వార్టర్స్‌లో బుధవారం తెల్లవారుజామున రైల్వే ఉద్యోగి అరవింద్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దాదాపు 15 తులాల వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుడి కథనం కుటుంబ సభ్యులతో కలిసి బంధువు అంత్యక్రియలకు వెళ్లి వచ్చేసరికి చోరీ జరిగింది. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి రూ.20,820 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డు ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని నాగటి సునీల్ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి కొండపర్తి గ్రామానికి చెందిన రాయపర్తి రమేష్, కరీమాబాద్‌కు చెందిన కొవాకుల రాజేష్, కరీమాబాద్ చెందిన కొవాకుల శివ పట్టుబడగా, దుగ్గొండి మండలం బండ గ్రామానికి చెందిన పల్లకొండ రమేష్, ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన నాగటి సునీల్ పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు.

రూ.2.26 లక్షల విలువైన గుట్కా స్వాధీనం

ఖిలా వరంగల్: గుట్కా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.2,26,650 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. వరంగల్ శివనగర్ సాయిబాబా టెంపుల్ లేన్‌లో వేముశెట్టి విశ్వనాథ్ ఇంట్లో నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

కాజీపేట: కాజీపేట రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో 12లీటర్ల నాటుసారాతో పాటు ఆటో, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఇండియా తండాకు చెందిన గుగులోతు బాలి.. ప్రతిరోజు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో నాటుసారాతో కాజీపేటకు చేరుకుంటుంది. ఆమె రాక కోసం అప్పటికే సిద్ధంగా ఉన్న ఆటోలో వెళ్లి నాటుసారాను విక్రయిస్తున్నారు. ఈక్రమంలో బాలి రైలు దిగి ఆటో ఎక్కిన తర్వాత ఆమెతో పాటు పల్లెపు సాంబరాజు, పల్లెపు మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. దాడుల్లో ఎస్సై తిరుపతి, ఖలీల్, కోటిలింగం, అయూబ్, పృథ్వీ, శివాని పాల్గొన్నారు.

మానవ హక్కుల నేత బుర్ర రాములు



కేయూ ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో రాములుకు నివాళులర్పిస్తున్న రాంబ్రహ్మం, తదితరులు



మొదటి గేట్ వద్ద బుర్ర రాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవన్, తదితరులు

కేయూ క్యాంపస్: మానవ హక్కుల కోసం నిరంతరం పోరాడిన కేయూ ప్రొఫెసర్ దివంగత బుర్ర రాములు ఆశయాల సాధనకు కృషి చేయాలని భారత్ బచావో హనుమకొండ జిల్లా చైర్మన్ రాంబ్రహ్మం అన్నారు. పీడీఎస్‌యూ (ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఆధ్వర్యంలో కేయూ ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో ప్రొఫెసర్ దివంగత బుర్ర రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ జగన్, సామాజిక విశ్లేషకులు శోభ, రమేష్, డీఎస్‌పీ కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐడీఎఫ్‌ఓ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు స్టాలిన్, భారత్ బచావో నాయకులు వెంగల్‌రెడ్డి, ఓంబ్రహ్మం, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

బుర్ర రాములు ఆశయాలు కొనసాగిద్దాం

మానవహక్కుల ఉద్యమ నేత దివంగత బుర్ర రాములు ఆశయాలను కొనసాగిద్దామని వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తీగల జీవన్ అన్నారు. పీడీఎస్‌యూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుర్ర రాములు 14వ యాదిసభను కేయూ మొదటి గేట్ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్ర రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తీగల జీవన్ మాట్లాడుతూ బుర్ర రాములు తన జీవితాన్ని మానవ, పౌర హక్కుల కోసం త్యాగం చేశారని కొనియాడారు. టీపీటీఎఫ్ నాయకుడు బైరి స్వామి, సీపీఐ న్యూడెమొక్రసీ నాయకుడు నున్న అప్పారావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, స్కాలర్ ఆదాసి రమేష్, జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, బాధ్యులు ముషారఫ్, గణేష్, నాని, శంకర్, శేఖర్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

లీడర్‌షిప్ క్యాంపునకు ఎంపిక



మోహన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు



ఎన్‌సీసీ కేడెట్లను అభినందించిన వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ ఆఫీసర్

రామన్నపేట: ఎన్‌సీసీ ఆర్మీ పదో తెలంగాణ బెటాలియన్ తరఫున నగరంలోని ఎల్‌బీ కళాశాలకు చెందిన బానోత్ మోహన్ ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు నిజామాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ ఆధ్వర్యంలో కరీంనగర్ సింగపూర్ టౌన్‌లోని కిడ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఆల్ ఇండియా లీడర్ షిప్ క్యాంపునకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టర్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపులో ఎల్‌బీ కళాశాల ఆర్మీ విభాగం నుంచి బానోత్ మోహన్ పాల్గొనడం అరుదైన అవకాశమని అన్నారు. ఈమేరకు ఆయనను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్యనారాయణ, సెక్రటరీ వినయ్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.సదానందం పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల కేడెట్లు..

కేయూ క్యాంపస్: హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో ఈనెల 14నుంచి పదిరోజుల పాటు నిర్వహించనున్న అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు సీనియర్ అండర్ ఆఫీసర్ కె.నివేదిక, భానురేఖ, ఎండీ.బాబా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎస్.స్వామి బుధవారం అభినందించారు. అలాగే, మామునూరులో జరగనున్న సీఏటీసీ -1క్యాంపులో పాల్గొనేందుకు వెళ్లిన పదిమంది ఎన్‌సీసీ కేడెట్లను సన్మానించారు.

మున్నూరు కాపు జిల్లా కమిటీ ఎన్నిక



కొత్త దశరథం



నాగరాజు

హన్మకొండ: తెలంగాణ మున్నూరు కాపు సంఘం హనుమకొండ జిల్లా కమిటీని హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలో బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొత్త దశరథం, ప్రధాన కార్యదర్శిగా కొండా నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా రాగంశెట్టి సత్యనారాయణ పటేల్, జినకల లక్ష్మణరావు, ఆకుల భూమయ్య, పుట్ట కిషోర్, ట్రెజరర్‌గా కూరపాటి సత్యప్రకాష్ రావు, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ పంచనగిరి గిరిప్రసాద్, పత్రి శ్రీకాంత్, మీడియా కన్వీనర్లుగా మొగిలి శ్రీనివాసరావు, బండారి సతీష్ పటేల్ ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవీందర్ వివరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడు పుప్పాల రజనీకాంత్ పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

కాజీపేట: దాదాపు 200 మంది సభ్యులతో ఉన్న అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయ్‌భాస్కర్ ఒంటెద్దు పోకడలు నచ్చక నూతన అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు చైర్మన్ బోడ్డు దేవయ్య తెలిపారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13 ఏళ్ల క్రితం ఏర్పడిన సంఘాన్ని తన వ్యక్తిగత అవసరాలకు విజయ్‌భాస్కర్ ఉపయోగించుకోవడం బాధాకరమని వాపోయారు. ఈ క్రమంలో సభ్యులందరు సమావేశమై ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వివరించారు. సంఘం కన్వీనర్‌గా మేకల మల్లికార్జున్, కోకన్వీనర్‌గా రేణుకుంట్ల ఉమామహేష్, రాయగిరి శ్రీనివాస్, కోశాధికారిగా కొండ్ర తిరుపతి ఎన్నికైనట్లు దేవయ్య వెల్లడించారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రాకేష్



మడికొండ: భారతీయ జనతా పార్టీ కాజీపేట 44, 45, 46, 64వ డివిజన్ల మండల ప్రధాన కార్యదర్శిగా మడికొండ గ్రామానికి చెందిన కుక్కల రాకేష్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, తిరుపతిరెడ్డి, కేశవరెడ్డి, కార్పొరేటర్ సరోజన, తదితరులకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

పరకాల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా మనోజ్



హసన్‌పర్తి: పరకాల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా హసన్‌పర్తి మండలం కోమటిపల్లికి చెందిన నమిండ్ల మనోజ్ నియమితులయ్యారు. ఈమేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని మనోజ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని నవోదయ విద్యానికేతన్ పాఠశాలలో 1993–1994లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళనం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సమావేశమై అప్పటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, పద్మ, ఉపేంద్ర, కట్టయ్య, నిరంజన్, రాము, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత ఘటాభిషేకం



హన్మకొండ అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమత్‌గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో రెండో రోజు బుధవారం ఉదయం గణపతి పూజ, నవగ్రహ మాన్య సూక్తహవనం నిర్వహించిన అనంతరం 108 కలశాలతో అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపించినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. మధ్యాహ్నం భజన కార్యక్రమం, మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవ సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, సభ్యులు దశరథ్‌కుమార్, మాదాసు మొగులయ్య, గంద్రతి సుధాకర్, గంట సత్యం, సీతా సమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.